డిఎస్‌సి అప్రెంటిస్ జిఒ ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: డీఎస్సీ 2024 నోటిఫికేషన్లో రెండేళ్ల అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో యూటీఎఫ్ నాయకులు నిరసిన చేపట్టారు. జీవో ప్రతులను సోమవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, దుర్మార్గమైన అప్రెంటిస్ విధానాన్ని ప్రభుత్వం పునరుద్ధరించడం తగదన్నారు. నాలుగున్నర ఏళ్లుగా ఒక్క డీఎస్సీ ప్రకటించని ప్రభుత్వం కంటి తుడుపుగా ప్రకటించి మోసం చేయడానికేనని చెప్పారు. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలక్రిష్ణ, జిల్లా కౌన్సిలర్లు ఎస్.కన్నయ్య, గౌరవ అధ్యకుడు సుబ్బారావు, రమణమ్మ, మేఘనాథ్, సీతన్న, మధు పాల్గొన్నారు.

దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

జగనన్నా..ఎలా సిద్ధం కావాలి?

- టెట్, డిఎస్‌సి నోటిఫికేషన్లు ఒకేసారి విడుదల
- టెట్ ఉత్తీర్ణత అయితేనే ఎలిజిబుల్
- అయోమయంలో అభ్యర్థులు
- హామీలు మరచిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: '

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం తగినంత వ్యవధి ఇవ్వకుండా టెట్, డిఎస్‌సి నిర్వహించేందుకు సిద్ధం కావడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేర్వేరు సిలబస్ అయినందున రెండు పరీక్షల మధ్య కొంత సమయం ఉండాలి. కానీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని వెనువంటే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుందని వారు మండిపడుతున్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వం తొందరపాటుతో వ్యవహరిస్తోందని అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

అనాటి జగనన్న మాటలివీ

'23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే చంద్రబాబు కేవలం 7,900 కొలువులకు డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డిఎస్ సి పెడతామని ప్రతి పిల్లవాడికి చెబుతున్నా.. ఎన్నికలకు వెళ్లేటప్పుడు ప్రతి పార్టీ మేనిఫెస్టో విడుదల చేస్తుంది'. అందులో ప్రతి మాటను పార్టీ నిలబెట్టుకోవాలి. అలా కాకపోతే ఆ నాయకుడు పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి తీసుకురావాలి. విపక్ష నేత హెూదాలో యువతను ఉద్దేశించి జగన్ అన్న మాటలివి'.

తీరా అధికారంలోకి వచ్చాక మాటలకు చేతలకు పొంతన లేకుండా పోయింది. నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా డిఎస్‌సి నిర్వహించని వైసిపి ప్రభుత్వం ఎన్నికలవేళ హడావుడిగా నోటిఫికేషన్ ఇచ్చింది.

గత డిఎస్‌సిలు.

టిడిపి ప్రభుత్వం డిఎస్‌సి-2014లో 10,313 పోస్టులు భర్తీ చేసింది. 2018లో 7,002 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఎంపిక ప్రక్రియ చేపట్టింది. కోర్టు కేసులతో పెండింగ్ పడడంతో వైసిపి వచ్చాక 7,254 పోస్టులను మాత్రమే భర్తీ చేసింది. డిఎస్‌సి-2018పై ఎన్నికల సమయంలో విపక్ష నేతగా జగన్ విమర్శలు గుప్పించారు. పాఠశాల విద్యాలో 23 వేల ఖాళీలు ఉన్నాయంటూ నిరుద్యోగులపై ప్రేమ కురిపించారు.

ఆయన అధికారం చేపట్టాక ఉన్న పోస్టులను జిఒ-17తో సర్దుబాటు చేయగా మరికొన్నింటిని రద్దు చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తగినంత వ్యవధి ఇవ్వకుండా టెట్, డిఎస్‌సి నిర్వహణపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేర్వేరు సిలబస్‌లు కావడంతో రెండు పరీక్షల మధ్య కాస్త సమయం ఉండాలి. కానీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్న యోచనతో వెంట వెంటనే పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మండిపడుతున్నారు.

వెనువెంటనే రెండు పరీక్షలు...

టెట్ లో ఉత్తీర్ణులు మాత్రమే డిఎస్‌సికి అర్హులు. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు-20 శాతం వరకు వెయిటేజీ ఉంటుంది. ఈ నేపథ్యంలో డిఎస్‌సి అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకం. కానీ టెట్, డిఎస్‌సి పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టెట్‌కు ఈనెల 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా, 18వ తేదీతో గడువు ముగుస్తుంది. 27 నుంచి మార్చి 9 వరకు రాత పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాలు మార్చి 14న విడుదల చేస్తారు. మరుసటి రోజు అంటే మార్చి 15 నుంచి డిఎస్‌సి పరీక్ష ప్రారంభమవుతుంది. ఒకేసారి రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియలేదని అభ్యర్థులు వాపోతున్నారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తర్వాతే డిఎస్‌సి పరీక్షకు షెడ్యూలు ఖరారు చేస్తారని, రెండింటి మధ్య కనీసం నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలని విద్యావేత్తలు, ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

తగినంత సమయం ఉండాలి..

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం తగినంత సమయం ఇవ్వాలి. టెట్, డిఎస్ సి వేర్వేరు సిలబస్ అయినందున రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఉండాలి. ఒకేసారి రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియడం లేదు. ఇది నిరుద్యోగులను మోసం చేయడమే.

డి.కుమార్
నిరుద్యోగి, పాడేరు

ఎలా సిద్ధం కాగలం..

ఇంత తక్కువ వ్యవధిలో టెట్, డిఎస్ సి రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కాగలం. ఆరేళ్ల తరువాత నిర్వహించనున్న డిఎస్‌సికి తీవ్రమైన పోటీ ఉన్నందున అభ్యర్థులు ప్రణాళిక యుతంగా ప్రిపేర్ కావాలంటే తగినంత సమయం ఉండాలి. డిఎస్ సి అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకం. కానీ టెట్, డిఎస్ సి పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై అభ్యర్థుల్లో ఆందోళన ఉంది.ఒకేసారి రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియడం లేదు.

ఎస్.రంజిత్
నిరుద్యోగి, పాడేరు

నిరుద్యోగులపై ఒత్తిడి

రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఇవ్వకపోతే అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వం తొందరపాటుతో వ్యవహరిస్తోంది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా డిఎస్‌సి నిర్వహించని వైసిపి ప్రభుత్వం ఎన్నికలవేళ హడావుడిగా నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రభుత్వం షెడ్యూల్ లో మార్పులు చేయాలి.



ప్రభుదాస్
డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు

సమయం ఇవ్వకపోతే ఎలా?

టెట్ లో ఉత్తీర్ణత సాధించడంతోపాటు మంచి మార్కులు వస్తేనే డిఎస్‌సిలో పోస్ట్ కొట్టేందుకు అవకాశం ఉంటుంది. అందువల్ల టెట్, డిఎస్‌సి పరీక్ష మధ్య సమయం ఇవ్వకపోతే ఎలా. రెండు పరీక్షల మధ్య కనీసం నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలి. కానీ ప్రభుత్వం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని హడావిడి తప్ప ఏమి లేదు.

జీవన్ కృష్ణ
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై జెడ్‌పిటిసి ఆగ్రహం

పిహెచ్‌సిలో ఒపి రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -విఆర్ పురం: సోమవారం సంతరోజున మారుమూల ప్రాంతాల నుంచి గిరిజనులు వైద్యసేవలు వస్తారని తెలిసికూడా రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి సకాలంలో విధులకు హాజరు కాకపోవడంపై జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి మండిపడ్డారు మండల సోమవారం నూతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన ఆయన. అక్కడే ఉన్న పాత భవనంలో రోగులకు అందుతున్న వైద్య సేవల పరిశీలనకు వచ్చారు. రోగులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జెడ్‌పిటిసి పరిశీలనకు వచ్చిన సమయంలో వైద్యాధికారి అందుబాటులో లేకపోవడం, డాక్టర్ గదిలో కుర్చీ ఖాళీగా దర్శనమివ్వడంపై మండిపడ్డారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నిస్తే సరైన సమాధానం రాకపోవడంతో , అక్కడి నుంచే డాక్టర్‌కు ఫోన్ చేశారు. ఫోన్ ఎత్తకపోవడంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర వైద్యసేవలు అందించాల్సిన వైద్యాధికారి తనకు వచ్చిన ఫోనును ఎత్తకపోవడం నిర్లక్ష్యమేనని, ప్రజాప్రతినిధిగా తాను చేసిన ఫోనుకే స్పందన లేకుంటే మామూలు రోగులు పరిస్థితి ఏమిటని ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. సంతరోజున వైద్యానికి వచ్చిన రోగులకు ఇలాంటి వైద్యసేవలే అందిస్తారా అని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి

- దూసరపాములో రైతుల ఆందోళన

ప్రజాశక్తి -రాజవొమ్మంగి : రైతుభరోసా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం ఇచ్చి రెండు నెలలు కావస్తున్నా, నేటికీ డబ్బులు చెల్లించడం లేదని మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన 100 మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. తాము పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా డిసెంబర్ 12న విక్రయించామని, ఆన్‌లైన్ చేయడంలో రెండురోజుల ఆలస్యంకాగా, ఇపుడు 50 రోజులు కావస్తున్నా, ధాన్యం డబ్బులు తమ ఖాతాలలో జమ కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి అడడగా, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను అపుడే ఆన్‌లైన్ చేసేశామని, డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. అంతకుమించి సమాచారం తమ వద్దని లేదని, రైతుల ఆందోళనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

దచీశీఅవగదీనిపై రైతులు ఆందోళన చెందుతూ, వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు చేశామని వడ్డీతో రుణం చెల్లించాలంటూ తమపై ఒత్తిడి పెరుగుతోందన్నారు మరోవైపు ఆలస్యమౌతున్న కొద్దీ తాము చేసిన అప్పులకు వడ్డీల భారం కూడా పెరిగిపోతుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి, తమకు రావాల్సిన ధాన్యం డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు

'సీలేరు'లో నీటి విడుదల నిలిపివేత

ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు చర్యలు
గ్రిడ్ ఆదేశాలతో విద్యుదుత్పత్తి నిలుపుదల
జెన్‌కో ఎస్ఇ (సివిల్) ప్రశాంత్‌కుమార్

పొల్లూరు విద్యుత్‌కేంద్రం నుంచి నిలిచిన నీటి విడుదల

ఎస్ఇ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు: ఇరిగేషన్ అధికారులు విజ్ఞప్తి సీలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను నిలిపేశామని ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) కెకెవి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు డయాఫ్రామ్ వాల్ సాంకేతిక లోపాలు తలెత్తడంతో, గేట్లు పనితీరు పరిశీలనకు అక్కడ పోలవరం ప్రాజెక్టులో నీటిమట్టం పెరగకుండా నిలకడగా ఉండేందుకు సీలేరు కాంప్లెక్స్ నుంచి విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని నిలిపేయాలని కోరగా, ఆమేరకు నిలుపుదల చేసినట్లు తెలిపారు సీలేరు జల విద్యుత్ కేంద్రంలో 240 మెగావాట్లు సామర్థ్యం గల దిగువ సీలేరు డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో 25 మెగావాట్లు పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 460 మెగావాట్లు సామర్థ్యం గల విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుదుత్పత్తిని ఆపేసి, నీటి విడుదల నిలుపుదల చేసామన్నారు. ఇరిగేషన్ అధికారులు నుంచి తదుపరి సూచనల మేరకు ఎపి జెన్‌కో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకే నీటి విడుదల నిలిపివేసామన్నారు.

ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయి జలాశయాలలో 12.81 టిఎంసిలు ఆంధ్ర వాటాగా, బలిమెల జలాశయంలో ఉన్న 19.93 టిఎంసిలతో కలుపుకొని మొత్తంగా ఉన్న 32.74 టిఎంసిల నీటి నిల్వలను మార్చి నెలాఖరు వరకు పొదుపుగా వాడుకుంటూ, విద్యుదుత్పత్తికి, ప్రజల తాగునీరు అవసరానికి వినియోగించుకుంటూ, గోదావరి డెల్టాలో రబీ పంటకు నీటి విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. ఎపి జెన్‌కో అధికారులు గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఇ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు.

చెట్టు పైనుంచి పడి గిరిజనుడు మృతి

మృతుడు రామసుందర్

ప్రజాశక్తి -మోతుగూడెం: చింతూరు మండలం, మోతుగూడెం పరిధి మల్లవరం క్యాంపులో కల్లు కోసం చెట్టెక్కిన గిరిజనుడు ప్రమాదవశాత్తు కిందన పడి మృతి చెందిన ఘటనచోటుచేసుకుంది. వివరాలివి. మల్లవరం గ్రామానికి చెందిన ఎం.రామసుందర్ (30ష్ట వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తారు. అతని భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఆదివారం రాత్రి కల్లు తీసేందుకని వెళ్లిన మృతుడు రాత్రి ఇంటికి రాకపోవడంతో, సోమవారం ఉదయం భార్య వెళ్లి చూడగా చెట్టు కింద విగతజీవిగా పడిఉండటాన్ని గమనించారు. ఆమె కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకోగా, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చెక్కులను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

ఆర్‌టిసి బస్ ప్రమాద బాధితులకు

రూ.59 లక్షల పరిహారం పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు : ఆర్టీసి బస్సు ప్రమాద బాధితులకు రూ.59లక్షల పరిహారం పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. 2023 ఆగస్టు 20న పాడేరు మండలం మోదాపల్లి పంచాయతీ పరిధిలోని ఘాట్ రోడ్డులో ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సు ప్రమాదానికి గురైన సంఘటన విధితమే. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు కుటుంబాలకు ఒక్కొరికి రూ.10 లక్షల చొప్పున అప్పట్లోనే పంపిణీ చేసామన్నారు. బస్సు ప్రమాద బాధితులు 31 మందికి రూ.39 లక్షల పరిహారాన్ని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలు బాధితులకు చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బాధితులకు రూ.59 లక్షల పరిహారం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మిగిలిన 31 మందిలో తీవ్రంగా గాయ పడిన ఇద్దరకు రూ.5 లక్షలు, స్వల్ప గాయాలైన 29 మంది బాధితులకు 1 లక్ష చొప్పున పరిహారం అందిస్తున్నామన్నారు.

పాడేరు శాసన సభ్యురాలు కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపిపి సొనారి రత్నకుమారి, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందేస్తున్న నాయకులు

కాఫీ కార్మికులకు కూలి రేట్లు పెంచండి

.ప్రజాశక్తి-పాడేరు: వేజ్ బోర్డు రేటు ప్రకారం కాఫీ కార్మికుల కూలి రేట్లు పెంచాలని కోరుతూ సోమవారం ఏపీఎఫ్‌డిసి డివిజనల్ మేనేజర్ జి.కృష్ణ బాబుకు కాఫీ కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ, కాఫీ కార్మికులకు ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో మినిమమ్ వేజ్ ప్రకారం పెరగవలసిన కూలి రేట్లు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. 2023 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు పెంచకపోగా కాపీ కార్మికులు వేలాది మందిగా రోజువారి వేతనంలో పెరిగిన వేతనం అందక నష్టపోవడం జరుగుతోందన్నారు తక్షణమే పేరిగిన కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. వివిధ స్థాయిలో సిబ్బంది నియామకం చేపట్టాలని, ఏపీసి విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు 26 రోజుల పని దినాలు కల్పిపించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పిఎఫ్, అన్ని ఎస్టేట్ పరిధిలో కార్మికుల నివాస గృహాల మరమ్మతు, మంచి నీటి సమస్య పరిష్కారం చేయాలన్నారు. తోటల్లో వాచ్మెన్ లను నియామకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండల కార్యదర్శి. దాసమ్మ, మండల కమిటీ సభ్యులు పార్వతమ్మ, సర్బు నాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

సమస్యలను పరిష్కరించాలి : ఐటిడిఎ వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- రంపచోడవరం :భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పథకాలను అమలు చేయడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఎ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా యూనియన్ నాయకులు చెక్క రాజ్‌కుమార్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ద్వారా గతంలో మాదిరిగా పథకాలు అమలు చేయాలని, పక్కదారి పట్టించిన సంక్షేమ బోర్డు సొమ్ములను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ప్రయోజనాన్ని చేకూర్చే సంక్షేమబోర్డును ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేశారని, కార్మికులకు సంక్షేమ పథకాలు అందకుండా సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రే 1214 మెమో జారీ చేశారని మండిపడ్డారు. ప్రమాదం, లేదా వయోభారంతో .భవన నిర్మాణ కార్మికులు మరణిస్తే సంక్షేమబోర్డు ద్వారా రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలు పరిహారం అందేదని, భవన నిర్మాణ కార్మికుని కుమార్తెకు వివాహానికి, లేదా ప్రసవానికి రూ. 50 వేలు ఆర్థికసాయం అందేదని కానీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ అటకెక్కించారని

ఐటిడిఎ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఆరోపించారు. భవన నిర్మాణకార్మికులకు నిధులను కాజేయడానికే సంక్షేమబోర్డును రద్దు చేశారని, భవన నిర్మాణ కార్మికులకు చెందాల్సిన డబ్బులు ముఖ్యమంత్రి దుర్బుద్ధితో ఫవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు మళ్లించారని ఆరోపించారు.

సంక్షేమబోర్డు ద్వారా కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయంపై ప్రశ్నిస్తే, వైఎస్ఆర్ బీమా వర్తింపజేస్తున్నామని ప్రభుత్వ పెద్దలు బుకాయింపు మాటలు చెబుతున్నారన్నారు. వైఎస్ఆర్ బీమా ద్వారా కేకలం కుటుంబపెద్ద చనిపోతేనే పరిహారం వస్తుందని, మిగిలిన కార్మికుల సంగతేంటని ప్రశ్నించారు.అంతేకాక ఇతర సంక్షేమ పథకాలను ఎవరిస్తారని ప్రశ్నించారు.

తెలంగాణా, కర్నాటక, తమిళనాడులతో సహా దేశంలోని అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు ద్వారానే వారికి పథకాలను అమలు చేస్తున్నారని, బిజెపి అడుగులకు మడుగులొత్తుతూ ముఖ్యమంత్రి జగన్ భవన నిర్మాణ కార్మికుల నోట్లో మట్టి కొడుతున్నాడని మండిపడ్డారు. కోల్పోయిన హక్కులతోపాటు, ఇతర సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి రామరాజు, జిల్లా నాయకులు జి సురేష్, ఎల్ పెద్దకాపు, ఆదినారాయణ, శ్రీను, సూరిబాబు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను వెంటనే ప్రారంభించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజశక్తి -చింతూరు/మోతుగూడెం : గిరిజన గ్రామాల్లో ప్రజలు పనులు లేక అవస్థలు పడుతూ, బతుకుతెరువు కోసం వలస పోయే పరిస్థితి ఉందని, వెంటనే ఉపాధిహామీ పథకం కింద పనులను ప్రారంభించాలని సిపిఎం నేతలు ఎర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం సున్నం దూలయ్య అధ్యక్షతన దబ్బగూడెంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, వ్యవసాయ సీజన్ ముగిసినందున గ్రామంలో కూలి పనులు లేక బయట పట్టణాలకు వలస వెళ్తున్నారని, తక్షణమే ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు చొరవ తీసుకొని ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని కోరారు.

కూలీలకు పని కల్పించి కుటుంబ పోషణకు ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి నిధులు కోతపెట్టడం దుర్మార్గమన్నారు. పెరుగుతున్న ధరలు కనుగుణంగా కూలీల కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకొని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 200 రోజులు ఉపాధి హామీ పనిదినాలు కల్పించాలని, రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. దబ్బగూడెంలో తెల్లం చిన్నయ్య గుంపులో ఉన్న బోర్ నుంచి బురదనీరు వస్తోందని, ఈ నీటిని తాగేందుకు ఇతర అవసరాలకు వినియోగానికి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ధోబి లక్ష్మణ్, తెల్లం చిన్నయ్య, కట్టం బజారు, జల్లి లక్ష్మయ్య, దూబి సుబ్బయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

ఇకెవైసి కోసం వేచివున్న గిరిజనులు

ఇళ్ల పట్టాలకు ఇకెవైసి కోసం అగచాట్లు

- గిరిజనుల పడిగాపులు.. పట్టించుకోని అధికారులు....

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని మాదగడ పంచాయతీ గంగగుడి, మెచ్చగుడ గ్రామ గిరిజనులు జగన్న ఇళ్ల పట్టాల ఇకెవైసి కోసం అగచాట్లు పడుతున్నారు. అరకులోయ మండల తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి పడిగాపులు కాసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకెవైసి కోసం తహశీల్దార్ కార్యాలయానికి రావాలని సమాచారం ఇవ్వడంతో గంగగుడి, మెచ్చగుడ గ్రామస్తులు ఇళ్ల పట్టాలు పట్టుకొని వచ్చారు. వీఆర్వోలు ఫోన్ చేస్తే స్పందన లేదని గిరిజనులు చెప్పారు.

జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులు వీఆర్వో లాగిన్‌లో బయోమెట్రిక్ వేస్తే ఇంటి పునాది నిర్మాణం నిమిత్తం డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని, ఇకెవైసి పడకపోతే పడవని చెప్పడంతో ఇల్లు పట్టాలు పొందిన ప్రతీ ఒక్కరు పట్టాలు పట్టుకుని తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు గంటల తరబడి వేచి ఉన్నారు. తక్షణం మండల తహశీల్దార్ స్పందించి మాదగడ పంచాయతీ పరిధి గ్రామాల ఇళ్ల పట్టా లబ్ధిదారులకు ప్రతి గ్రామానికి వచ్చి బయోమెట్రిక్ తీసుకోవాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి, సర్పంచ్

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీలో డ్రెయినేజీల నిర్మాణానికి స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ సోమ్మేల రూతు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సర్పంచులు మాట్లాడుతూ, మండల కేంద్రం లోని వైయస్సార్ విగ్రహం నుండి పెద్దూరు చర్చి వరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హర్షిత్ రాజ్యం, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సచివాలయం సెక్రటరీలు రమేష్, శేఖర్, సిపిఎం మండల కార్యదర్శి నాగులు పాల్గొన్నారు.

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని అన్నవరం సంతలో తెలుగుదేశం పార్టీ నేతలు సూపర్ 6 - మినీ మ్యానిఫెస్టోపై ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, మాజీ మండల అధ్యక్షులు బేరా సత్యనారాయణ, కుడుముసారి, మాజీ యంపిటిసి మర్రి బింగు, అన్నవరం మాజీ యంపిటిసి పొత్తూరు దేవయ్య, అన్నవరం మాజీ సర్పంచ్ ఎలుసూరి సోమయ్య, తెలుగు యువత కార్యదర్శి బోనంగి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

» మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్, 18 నుంచి 30 వరకు టెన్త్ పరీక్షల నిర్వహణ

» జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: ఇంటర్మీడియేట్, పది పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో ఇంటర్మీడియేట్, పదవ తరగతి పరీక్షల నిర్వహణ పై సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 10వ తరగతికి 65, ఇంటర్మీడియేట్ 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. పది పరీక్షలకు 10,986 మంది విద్యార్థులు రెగ్యులర్ గాను, 955 మంది ప్రైవేటు గాను మొత్తం 11,941 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. 65 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 563 మంది ఇన్విజిలేటర్లను, 5 ఫ్లైయింగ్ స్క్వాడ్లను నియమించామని తెలిపారు. 22 పోలీస్ స్టేషన్లలో పరీక్షా పత్రాలను భద్రపరచాలని చెప్పారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

మార్చి 1 నుండి 20 వరకు జరుగనున్న ఇంటర్మీడియేట్ పరీక్షలకు 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 14611 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. జనరల్ 12054 మంది, ఒకేషనల్ 2557 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. 27 మంది పరీక్షా కేంద్రాలలో 27 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 610 మంది ఇన్విజిలేటర్లను రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను నియమించామని చెప్పారు. పరీక్షా కేంద్రాలలో తాగునీటి సదుపాయాలు, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో 144 సెక్షను అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని నియమించి అవసరమైతే వైద్య సేవలు అందించాలని చెప్పారు. రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో బస్సులు నడపాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. ఎపిఓఎస్ పరీక్షలను పర్యవేక్షించాలని, మహిళా పోలీసుల సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ధీరజ్, పరీక్షల సహాయ సంచాలకులు వినయ్ మోహనరావు, డిఐఇ ఓ.అప్పలరాము, డిపిఓ కొండలరావు, డిటి ఓ ఎస్.లీలా ప్రసాద్, పాడేరు సిఐ డి.నవీన్ కుమార్, ఎస్టీఓ కృపారావు, పబ్లిక్ ట్రాన్స్పోర్టు విభాగం సూపరింటెండెంట్ ఎస్. అప్పారావు, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫారాలను పరిష్కరించండి : కలెక్టర్

ప్రజాశక్తి పాడేరు : అపరిష్కృతంగా ఉన్న ఫారం లను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఎన్నిక ప్రక్రియపై తహసీల్దారులు, ఎంపిడిఓలతో సోమవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫారం 6, ఫారం 7,8 లను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. నిజమైన ఓటర్లను తొలగించలేదని పొలిటికల్ పార్టీలకు సమాచారం అందించాలన్నారు. 1056 ఫారం 6 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం 6 లను చింతపల్లి, జి.మాడుగుల, రంపచోడవరం బూత్ స్థాయి అధికారి లాగిన్ పరిశీలించాలని సూచించారు. ఫారం 7 పాడేరు, రాజవొమ్మంగి, ఫారం 8 చింతూరు, మారేడుమిల్లి, వై.రామవరం తహసీల్దారులు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. వారం రోజులకు మించి బి.ఎల్ ఓ లాగిన్‌లో పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఎంపిడి ఓలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. బీమా క్లైమ్స్ పరిష్కారంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీమా ఏజెంట్లు డబ్బుకు డిమాండు చేయకూడదని అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడి ఓలు బీమాపై సమీక్షించాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఉన్న గ్రామ సచివాలయం భవనాల్లో రాత్రి బస చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ పిఓలు సూరజ్ గనోరే, చైతన్య పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశామని సమిధ సంస్థ ప్రతినిధి వీరభద్రరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాతల సహకారంతో లక్ష్మీపురం, మర్దగూడ, పింపుడువలస, ములియాగూడ, ముప్పవలస పాఠశాలలో చదువుతున్న 410 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పడాల రమణ, కోఆర్డినేటర్ దీసరి బుద్ధిరాజు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న పిఇటి

సైకాలజీ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-విశాఖపట్నం : 28వ అంతర్జాతీయ, 59వ జాతీయ ఇండియన్ అకాడమీ ఆఫ్ అప్లయిడ్ సైకాలజీ సదస్సుల్లో పాల్గొని, పలు అవార్డులను సాధించిన ఎయు సైకాలజీ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి అభినందించారు.

ఇటువంటి సదస్సుల్లో పాల్గొనడం ద్వారా నూతన జ్ఞానాన్ని నిపుణుల నుంచి పొందడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎంవిఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జీపు బోల్తా : ఇద్దరు మృతి

ప్రజాశక్తి - చింతపల్లి: జీపు బోల్తా పడిన దుర్ఘటనలో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయాల పాలయ్యారు. మండలంలోని కుడుముసారి పంచాయతీ శివారు గ్రామలైన సంపంగిపుట్టు, భీమనపల్లి తమ్మంగుల పంచాయతీ ధోని పాలెం సరిహద్దులో ప్రయాణికులతో వెళుతున్న జీపు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరు మృతి చెందారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం సోమవారం అన్నవరం వారపు సంతకు వచ్చి నిత్యవసర సరుకులు కొనుగోలు చేసుకుని తిరుగు ప్రయాణంలో జీపుపై ప్రయాణికులు వెళుతున్నారు. జీపు అదుపుతప్పి బోల్తా పడడంతో సంఘటన స్థలంలోనే ఐర్త పెద్దమ్మ (65) మృతి చెందగా, తీవ్ర గాయాలైన క్షతగాత్రులను హుటాహుటినా లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో మరొక వ్యక్తి వంతల అప్పారావు (50) మృతి చెందాడు. మరో ముగ్గురికి కాళ్లు, చేతులు విరిగినట్లు సమాచారం. తీవ్ర గాయాలైన వారిని పాడేరు క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి- పెదబయలు : జర్నలిస్టు పై దురుసుగా ప్రవర్తించిన దాడి చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ టోటోడిపుట్టు గ్రామంలో గత నెలలో బైక్ ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. అదే సమయంలో వస్తున్న విలేకరి సంఘటన స్థలంలో గ్రామస్తులు గుమి గూడి ఉండటంపై ప్రశ్నించారు. దీంతో, విలేకరిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతగిరి: పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టిక ఆహారం క్రమం తప్పకుండా సక్రమంగా పంపిణీ చేయాలని మాతా శిశు సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా ఆర్‌జెడి జి.చిన్మయిదేవి ఆదేశించారు. సోమవారం మండలంలోని కొండిబ పంచాయతీ తేడా అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సకాలంలో టెక్ హోమ్ రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు అచ్యుతాంభ, సంతోష్ కుమారి, శాంతి ప్రియ పాల్గొన్నారు

ఎయును సందర్శించిన ఎన్‌ఒఎఎ చీఫ్ సైంటిస్ట్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌ఒఎఎ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్ తల్లా ప్రగడ సందర్శించారు. ముందుగా చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఎయు వాతావరణ శాస్త్ర విభాగాన్ని సందర్శించి, అక్కడ ఆచార్యులతో సంభాషించారు. అక్కడ జరుగుతున్న పరిశోధనలు, పరిశోధన వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజయ్ తల్లాప్రగడ మాట్లాడుతూ, అమెరికాలోని అత్యున్నత విశ్వవిద్యాలయాలైన ఎంఐటి, హార్వర్డ్ వర్సిటీల తరహాలో ఎయు అభివృద్ధి సాధిస్తోందన్నారు. ఎయులో చదువుకుని ఉన్నత స్థానాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా తమ నైపుణ్యాలను, సామర్థ్యాలను నేటితరం విద్యార్థులకు అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం విజయ్ తల్లాప్రగడను వీసీ సత్కరించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఎయు వాతావరణశాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.సునీత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు.

ఎపిఎండిసికి ఎయు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎండిసి) సంస్థలో ఉద్యోగాలకు ఎయు విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఎయు ఎంహెచ్‌ఆర్ఎం కోర్సును చదువుతున్న ఎం.ఉషారవి శ్రీ కిరణ్, ఎంఎ.నూకరాజు, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ చదువుతున్న కుంచె అపూర్వ ఎపిఎండిసిలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనంగా రూ.8.4 లక్షలు అందిస్తారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విఆర్.రెడ్డి, ఆచార్య జాలాది రవి, ఆచార్య అరుణ్ కుమార్, ఆర్ట్స్-కామర్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.మోహన్‌గణేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 700 మందికిపైగా విద్యార్థులు ప్రాంగణ నియామకాలలో ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విఆర్.రెడ్డి తెలిపారు.

వినతులు స్వీకరిస్తున్న పిఒ సూరజ్ గనోరే

'స్పందన'కు 52 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం: : స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో52 అర్జీలు వచ్చాయి. ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులతో స్పందన నిర్వహించి, ఏజెన్సీలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విని, వాటికి సబంధించి దరఖాస్తులను స్వీకరించారు. సోమవారం స్పందనలో భూసమస్యలకు సంబంధించి పలు అర్జీలురాగా, సంబంధిత అధికారులకు నివేదించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పిఒ భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌డిసి డిఎస్ శాస్త్రి, గిరిజనసంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అబూ సలాం, ఎడిఎంహెచ్‌ఒ డాక్టర్ జి.ప్రకాశం, పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు, డిఎల్‌పిఒ రాఘవన్, డిఎల్‌డిఒ కె.కోటేశ్వరరావు. డాక్టర్ ఇందిర ఇఇలు జి. దేవిడ్‌రాజ్, సుబ్బయ్య, ఎండి యూసఫ్, ఎ.రవి, ఎడిఎ సిహెచ్‌కెవి చౌదరి, పిహెచ్‌ఒ చిట్టిబాబు, పిఎఒ రాంబాబు, ఉపాధి పిడి జి. శ్రీనివాస్, సిడిపిఒ సంధ్యారాణి, జిసిసి సీనియర్ మేనేజర్ ముర్ల వెంకటరాజారెడ్డి, డిఇఇలు సాయి సతీష్ రాజేంద్రబాబు, మల్లికార్జున రావు, లీగల్ సెల్ డిటి స్వామి, న్యాయవాది ఎన్‌వివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

తహశీల్దార్ రమణయ్య హత్య కేసులో.. విచారణ పూర్తి ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : తహశీల్దార్ సనపల రమణయ్య హత్య కేసు విచారణ దాదాపు పూర్తయినట్టు తెలుస్తోంది. నిందితుడు మురారీ సుబ్రమణ్యం గంగారావు గడచిన వారం రోజులుగా పోలీసుల అదుపులోనే ఉన్నా సరే ఆయన నుంచి ఏ వివరాలు రాబట్టారన్నది పోలీస్ బాస్‌లు గోప్యంగా వుంచుతున్నారు. సోమవారంతో ఆయన్ని డిసిపి, ఎసిపి, సిఐ స్థాయి అధికారులు మధురవాడ పోలీస్టేషన్‌లో విచారించినట్టు తెలిసింది. రమణయ్యను హత్య చేసిన మరుసటి రోజునే పోలీసులు నిందితుడు గంగారావును పట్టుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన తర్వాత నాలుగు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించడంతో విచారణ కూడా దాదాపు పూర్తయినట్టుగా తెలుస్తోంది. అయితే ఏం జరిగిందన్నది పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులెవ్వరూ ఈ వ్యవహారంలో తలదూర్చడం లేదు. పోలీసుల విచారణే నడుస్తోంది. రెవెన్యూ అసోసియేషన్ ఉద్యోగులు మాత్రం విచారణ విషయంలో సంతృప్తి చెందడం లేదని తెలుస్తోంది. ఈ నెల 12 నుంచి పెన్‌డౌన్ చేయాలని నిర్ణయించుకున్నా తర్వాత వీరు వెనక్కి తగ్గారు. ఇంతవరకూ రెవెన్యూగానీ, పోలీసు యంత్రాంగంగానీ పెదరుషికొండలోగల సర్వే నెంబరు 380/1లో నిర్మించిన అపార్టుమెంట్‌కు సంబంధించిన స్థలానికి కన్వేయెన్స్ డీడ్ జారీ విషయమే హత్యకు దారితీసినట్లు తెలిపాయి మినహాయిస్తే సంభాషణ, ఆర్థిక లావాదేవీల విషయాలను బయటపెట్టలేదు. ఇంటరాగేషన్‌లో ఉంటుండగా సమాచారం ఇవ్వలేమని పోలీసులు ఒక వైపు చెబుతున్నారు.

'మెన్ ఆఫ్ ప్లాటినం'తో ప్రత్యేక ఆకర్షణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పురుషుల ఆభరణాల విషయంలో ప్రపంచ పోకడలను అనుసరించి నెక్ వేర్, రిస్ట్ వేర్, ఉంగరాల విభాగాల్లో వివిధ రకాల ఆభరణాలను మెన్ ఆఫ్ ప్లాటినం అందిస్తుందని పిజిఐ ఇండియా బిజినెస్ డైరెక్టర్ పల్లవి శర్మ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ మెన్ ఆఫ్ ప్లాటినం- 2024 విశేషాలను వివరించారు. పురుషుల ఆభరణాల విషయంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు.

నేడు విశాఖకు సిఎం జగన్

'ఆడుదాం-ఆంధ్ర' ముగింపు వేడుకల్లో ప్రసంగం

ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలోని పిఎం.పాలెం వద్దనున్న ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరుగనున్న 'ఆడుదాం-ఆంధ్ర' రాష్ట్ర స్థాయి పోటీల ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ముగింపు సంబరానికి లక్ష మంది వీక్షకులు రానున్నారని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మాజీ మంత్రి, భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ క్రికెట్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన షెడ్యూల్‌ను తెలియజేశారు. ఆయన వెంట జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎడిసి కెఎస్.విశ్వనాథన్ తదితరులు ఉన్నారు.

జగన్ పర్యటన ఇలా..

బుధవారం సాయంత్రం 4.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు విమానంలో సిఎం జగన్ వస్తారు. అక్కడ నుంచి ఐటి హిల్ నెంబర్ 3 (మధురవాడ)కు 5.45 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియానికి వెళ్తారు. క్రీడలను కాసేపు తిలకించిన తర్వాత ఆరు గంటలకు జరిగే ముగింపు ఉత్సవంలో పాల్గొని ప్రసంగిస్తారు.

ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లకు

నిధులు కేటాయించాలని ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎల్‌ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిదుల విషయమై సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు మొండి చేయి చూపడం అన్యాయమని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించి దళితుల నోట్లో జగన్ ప్రభుత్వం మట్టికొడుతోందన్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి చదువుకున్న దళిత యువకులకు స్వయం ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని అన్నారు. వందల సంఖ్యలో పాఠశాలలను మూసివేసి దళిత విద్యార్థులకు విద్యను దూరం చేయడంపై మండిపడ్డారు. తక్షణం దళిత వ్యతిరేక చర్యలు విడనాడి సామాజిక న్యాయ సాధికారతను సార్థకం చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని నిజాయితీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి, జిల్లా కార్యదర్శి టి.చిరంజీవి, ఉపాధ్యక్షులు వై.రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి.ప్రసాదరావు, జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, ఎన్.ఎర్రిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి స్పందనలో వినతి పత్రం సమర్పించారు.

నినాదాలు చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన రోజ్‌గార్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ పరిధిలోని సిఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో పోర్టు సాగర్ మాలా కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఉద్యోగాలు పొందిన 194 మంది అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే రోజ్‌గార్ మేళా ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతకు నియామక పత్రాలను అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

దేశవ్యాప్తంగా 46 ప్రాంతాల్లో రోజ్‌గార్ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహారావు, సిఐఎస్ఎఫ్ డిఐజి మాటేటి నందన్, సీనియర్ కమాండెంట్ ప్రణీత్ చంద్ర, కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పాయ్, విశాఖపట్నం పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలోని చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - సీలేరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపల్ సాయిరాం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణ, పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం ఏరివేసి నిప్పుపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా సీలేరు పంచాయతీతోపాటు వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ దత్తత గ్రామం బచ్చులూరులో వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంటారని ప్రజల్లో చైతన్యం కల్పించారు. పలువురు లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచగ్రామాల సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పంచగ్రామాలు, సింహాచలం దేవస్థానం భూసమస్యల పట్ల ప్రభుత్వం ఉదారంగా ఉందని, భూఅనుభవదారులు ఎటువంటి ఆందోళనా చెందనవసరం లేదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సింహాచలం భూసమస్యలపై ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, భూఅనుభవదారులతో సమీక్షా సమావేశాన్ని సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచగ్రామాలు, సింహాచలం భూములకు సంబంధించిన భూఅనుభవదారుల సమస్యలను బాధితుల తరపున ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. అయితే ఈ సమస్య ప్రభుత్వ పరిధిలో కాకుండా కోర్టు పెండింగులో ఉందనే విషయాన్ని స్థానికులకు తెలియజేయడం జరిగిందని తెలిపారు. అయినప్పటికీ భూఅనుభవదారులకు ఎటువంటి నష్టం వాటిల్లకూడదనే సదుద్దేశంతో ఈ వారంలోనే అడ్వకేట్ జనరల్‌తో చర్చించి కోర్టులో అఫడవిట్ ఫైలు చేసి హియరింగ్ వచ్చేలా ప్రయత్నిస్తామని ఉపముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలతో పాతబడిన భవనాలకు ఆయా భవన యజమానులు మరమ్మతులను చేసుకునేలా అధికారులకు తగు సూచనలు చేశామన్నారు. ఈలోగా సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు. భీమిలి శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పెందుర్తి శాసనసభ్యులు అదీప్ రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా సింహాచలం దేవస్థానం భూఅనుభవదారుల సమస్య పెండింగులో ఉందని, దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి లబ్ధిదారులకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

14న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 14న బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ ఎం.పోలినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సభ్యులు, అహ్వానితులు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.